SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 259 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 28, మే 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

# అధిక ప్రాధాన్యం రైతు సంక్షేమానికే

**అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేల పరిహారం**

- అధికారులు నివేదిక తయారు చేసి ప్రతిపాదనలు పంపించాలి
- జూన్ 3 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా భూభారతి రెవెన్యూ సదస్సులు
- ఎరువులు, విత్తనాల కొరత రానివ్వం.. నకిలీ విత్తనాలు అమ్మేవారిపై పీడీ యాక్ట్
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టోకెన్ ద్వారా ఉచిత ఇసుక సరఫరా
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- గతంలో కంటే 22 లక్షల టన్నుల ధాన్యం ఎక్కువగా కొనుగోలు చేశామని వెల్లడి



2లో



## పద్మాలు అందుకున్న ప్రముఖులు

- తెలంగాణ నుంచి మందకృష్ణ
- ఏపీ నుంచి కేఎల్ కృష్ణ, రాఘవేంద్రాచార్య

2లో

## ఉగ్రవాదమే పాకిస్థాన్ యుద్ధనీతి



- ఆ వ్యూహాన్ని మన దేశం గట్టిగా తిప్పికొడుతుంది
- అహ్మదాబాద్‌లో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

**మే 27, సమయం న్యూస్, గాంధీనగర్ :** పాకిస్థాన్ ఆచరిస్తున్న ఉగ్రవాదం పరోక్ష పోరు కాదని.. ఉద్దేశపూర్వక యుద్ధ వ్యూహమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆ వ్యూహాన్ని తిప్పి కొట్టడానికి భారత్ గట్టిగా బదులిస్తుందని స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి మద్దతు కొనసాగించడం ద్వారా పొరుగుదేశం యుద్ధంలో కొనసాగుతోందన్నారు. "వసుధైక

తరువాయి 2లో

## ఈసారి వర్షాలు పుష్కలం!.. ఐఎండీ అంచనా

**మే 27, సమయం న్యూస్, విశాఖపట్నం:** నైరుతి రుతు పవనాల ప్రభావంతో ఈ సారి దేశంలో పుష్కలంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేస్తోంది.

తరువాయి 2లో




## అందాల పోటీల ఫైనల్‌కి కౌంట్‌డౌన్

- టాప్ 40లో ఇప్పటికే 12 బెర్తులు ఖరారు
- మిగిలిన వారిని ఎంపిక చేయనున్న న్యాయనిర్ణేతలు
- 31న జరిగే కార్యక్రమానికి హైటెక్స్‌లో ఏర్పాట్లు

**మే 27, సమయం న్యూస్, హైదరాబాద్:** మిస్ వరల్డ్ 2025 ఫైనల్ పోటీలకు కౌంట్‌డౌన్ మొదలైంది. క్వార్టర్ ఫైనల్‌కు చేరిన 40 మంది అందాలభామలు ఫైనల్‌లో ప్రపంచ సుందరి కిరీటం కోసం పోటీపడతారు. ఇప్పటివరకు స్పోర్ట్స్ ఛాలెంజ్‌లో ఒకరు, టాలెంట్ ఛాలెంజ్‌లో ఒకరు, హెడ్ టు హెడ్ ఛాలెంజ్‌లో నలుగురు, టాప్ మోడల్ పోటీల్లో నలుగురు, బ్యూటీ విత్ ఏ పర్పస్ విభాగం నుంచి నలుగురు.. మొత్తం 14 మంది విజేతలై

తరువాయి 2లో








## మళ్లీ ఏపీ హైకోర్టుకు జస్టిస్ బట్టు దేవానంద్

- తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి
- జస్టిస్ సుజయ్‌పాల్ కలకత్తా హైకోర్టుకు బదిలీ
- జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ లలిత, జస్టిస్ సుమలత మళ్లీ తెలంగాణ ఉన్నత న్యాయస్థానానికి
- సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు
- 10 హైకోర్టులకు చెందిన 21 మంది న్యాయమూర్తుల బదిలీ

**మే 27, సమయం న్యూస్, దిల్లీ:** మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీపై వెళ్లిన జస్టిస్ బట్టు దేవానంద్‌ను మళ్లీ ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలో తొలిసారి సమావేశమైన కొలీజియం.. 10 రాష్ట్రాలకు చెందిన 21 మంది న్యాయమూర్తులను బదిలీ చేయాలని నిర్ణయించింది. అందులో జస్టిస్ బట్టు దేవానంద్ కూడా ఉన్నారు. 2020 జనవరి 13న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. మద్రాస్ హైకోర్టుకు బదిలీపై వెళ్లి 2023 ఏప్రిల్ 10న అక్కడ బాధ్యతలు తీసుకున్నారు. జస్టిస్ బట్టు దేవానంద్ 1966 ఏప్రిల్ 14న జన్మించారు.

తరువాయి 2లో

## వాయుసేనకు నూతన శక్తి!





2లో

- ఐదో తరం యుద్ధవిమానం తయారీలో ముందడుగు
- 'ఆమ్కా' ప్రాజెక్టు 'ఎగ్జిక్యూషన్ నమూనా'కు రక్షణ శాఖ ఆమోదం
- దేశీయ పరిజ్ఞానానికి పెద్దపీట

## ఏపీ దశ, దిశ మారుస్తాం..

- అందుకు అవసరమైన విధానాలు రూపొందిస్తాం
- పసుపు సైనికుల త్యాగాల ఫలితమే ఈ అధికారం
- అందుకు తగిన గుర్తింపు, గౌరవం ఇస్తాం
- కార్యకర్తల ద్వారా పాలనే నిజమైన పొలిటికల్ గవర్నెన్స్
- మూడు పార్టీలు కలిసి నడవాలి.. కలిసి గెలవాలి..
- గత పాలకుల కుంభకోణాల లెక్కలు తీస్తున్నాం
- దోపిడీదారులు, గాడి తప్పిన నేతలు, అధికారులకు శిక్ష తప్పదు
- తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు
- ఘనంగా ప్రారంభమైన మహానాడు వేడుకలు



2లో

# అధిక ప్రాధాన్యం రైతు సంక్షేమానికే

హైదరాబాద్: రైతుల శ్రేయస్సు, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం వర్షాలు ముందుగానే కురుస్తున్న నేపథ్యంలో అన్నదాతలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు వర్షాల వల్ల ధాన్యం విక్రయంలో కొందరు రైతులకు ఇబ్బందులు తలెత్తాయని.. వారికి అండగా నిలవాలన్నారు. ధాన్యం విక్రయంలో రైతుల్ని ఇబ్బందులకు గురిచేసే మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోళ్లు, వానాకాలం పంటకు వ్యవసాయ శాఖ సన్నద్ధతపై సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ రామకృష్ణారావు హాజరయ్యారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్ సహా కొందరు మంత్రులు జిల్లాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని మండలాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సుల్ని నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమల్లో కలెక్టర్లు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ‘‘అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకుంటాం. ఎకరానికి రూ.10 వేల పరిహారం అందించేందుకు నివేదిక తయారు చేసి అధికారులు ప్రతిపాదనలు పంపాలి. వర్షాలు ముందస్తుగా వచ్చాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ శాఖ ప్రణాళికలలో మార్పులు చేసుకోవాలి. రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియాను అందుబాటులో ఉంచాలి. విత్తనాల, ఎరువులు అక్రమ స్టాక్ ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలి. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలి.

**90 శాతం రైతులు సంతోషంగా..**

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో గతంలో ఎన్నడూ లేని విధంగా మంచి ఫలితాలను సాధిస్తోంది. రైతులకు 48 గంటల్లో చెల్లింపులు పూర్తి చేస్తున్నాం. గతంలో కంటే ఈ సీజన్‌లో దాదాపు 22 లక్షల టన్నుల ధాన్యాన్ని అధికంగా కొనుగోలుచేసిన పౌరసరఫరాల సంస్థను అభినందిస్తున్నా. 90 శాతానికిపైగా రైతులు ధాన్యాన్ని విక్రయించి సంతోషంగా ఉన్నారు. తెలంగాణకు రుతుపవనాలు ముందుగా రావడంతో కల్లాల వద్ద ధాన్యం తడిసిపోయి కొంతమంది రైతులు ఇబ్బందుల్లో ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. 10 లక్షల 50 వేల మంది రైతుల వద్ద నుంచి 64 లక్షల టన్నులకుపైగా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేశాం. ప్రభుత్వం చేసిన మంచి పనిని చెప్పుకోవాల్సిన అవసరం ఉంది.

**ప్రజల్ని భూతంలా పీడించిన ధరణి**

భూ భారతి చట్టం అమలుకు ముందస్తుగా నాలుగు మండలాలను ఎంపిక చేసుకున్నాం. అనంతరం ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని పైలట్‌గా ఎంపిక చేసుకొని రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. జూన్ 3 నుంచి 20 వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు రాష్ట్రంలోని అన్ని మండలాల్లో నిర్వహించాలి. వీటిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతోపాటు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించాలి. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వ్యవస్థ ప్రజలను భూతంలా పీడించింది. భూ భారతి చట్టం పేదలకు చుట్టంలా పని చేస్తుంది.

* **యువ వికాసంతో ఇటుక, సెంట్రింగ్ యూనిట్లు**

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలును కలెక్టర్లు పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలి. మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలను నియమించాలి. మేస్త్రీ ఛార్జీలు, నిర్మాణ పరికరాల ధరలు నియంత్రణలో ఉండాలి. అడ్డగోలు ధరలతో పేదలను మోసం చేయకుండా జాగ్రత్త వహించాలి. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టోకెన్ జారీ చేసి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలి. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక దోపిడీ జరగకుండా జాగ్రత్త వహించాలి. మహిళా సంఘాలు, యువత ద్వారా ‘రాజీవ్ యువవికాసం’ కింద ఇటుక, సెంట్రింగ్ యూనిట్ల తయారీ కేంద్రాల ఏర్పాటు చేయించాలి. తక్కువ ధరతో నాణ్యమైన ఇళ్ల నిర్మాణానికి అనేక కొత్త సాంకేతిక పద్ధతులు వచ్చాయి. వీటిని లబ్ధిదారులకు తెలపాలి. కలెక్టర్లు, ఇన్‌ఛార్జి మంత్రులు మే 29, 30 తేదీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వానాకాలం సాగు ఏర్పాట్లు, ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతిపై రిపోర్టు తయారు చేసి జూన్ 1 నాటికి సమర్పించాలి. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవాలను జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలి’’ అని సీఎం ఆదేశించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని సూచించారు.

* **పూర్తిస్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేయాలి: మంత్రి ఉత్తమ్**

పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాలకు పెద్ద ఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉందని.. పూర్తిస్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేయాలని తెలిపారు. ‘రవాణా సమస్యలు రాకుండా రవాణా, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో వాహనాలు అందుబాటులో పెట్టాలి. మిల్లర్లు సహకరించకపోతే ఇంటర్మీడియట్ (తాత్కాలిక) గోదాములకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి’ అని ఉత్తమ్ అన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టు కింద మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లలో 15 శాతం మాత్రమే నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, మిగతావాటి పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వానాకాలం పంటల సాగుకు వ్యవసాయ శాఖ సన్నద్ధం కావాలన్నారు.

* **వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి: సీఎం**

హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ చేసిన సూచనలకు అనుగుణంగా తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముందుగా వచ్చిన వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు, జ్వరాలు వచ్చే ప్రమాదముంటుందని.. వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా ఏజెన్సీ, అటవీ ప్రాంతాలున్న జిల్లాల కలెక్టర్లు ప్రజారోగ్యంపై మరింతగా దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు నమోదవుతున్నాయని, అన్ని జిల్లాల్లోనూ సీజన్‌కు అనుగుణంగా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు.

## వాయుసేనకు నూతన శక్తి!

దిల్లీ: అత్యంత అధునాతన ఐదోతరం స్టెల్త్ యుద్ధవిమానాన్ని సాకారం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. ‘అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్’ (ఆమ్కా) ప్రాజెక్టు అమలు కోసం ‘ఎగ్జిక్యూషన్ నమూనా’కు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు. రక్షణ రంగంలో స్వదేశీ తయారీని ప్రోత్సహించే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశీయ పరిజ్ఞానంతో ఆమ్కా ప్రాజెక్టుపై భారత్ కొంతకాలంగా కసరత్తు చేస్తోంది. దీనికింద మధ్యస్థ బరువు కలిగిన అధునాతన స్టెల్త్ యుద్ధవిమానాన్ని అభివృద్ధిచేస్తోంది. ఇది శత్రువుల రాడార్లను ఏమార్చి, వారి గగనతలంలోకి లోతుగా చొచ్చుకెళుతుంది. దీనిద్వారా భారత వైమానిక పోరాట సామర్థ్యం మరింత మెరుగుపడుతుంది. పరిశ్రమల భాగస్వామ్యంతో బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) దీన్ని అమలు చేస్తుంది. ఎగ్జిక్యూషన్ నమూనా కింద.. ప్రైవేటు, ప్రభుత్వరంగ సంస్థలకు పోటీ ప్రాతిపదికన సమానావకాశాలు దక్కుతాయి. బిడ్‌లు స్వతంత్రంగా, సంయుక్తంగా, కన్సార్షియం ద్వారా దాఖలు చేయవచ్చు. ఆ సంస్థ భారత్‌కు చెందినదై ఉండాలి. ఆమ్కా నమూనాను ఇటీవల బెంగళూరులో ‘ఏరో ఇండియా’లో తొలిసారి ప్రదర్శించారు.

**ప్రతికూల పరిస్థితుల్లోనూ సత్తా చాటేలా..**

* కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఎలక్ట్రానిక్ పైలట్, నెట్ ఆధారిత ఆయుధ వ్యవస్థలు వంటి ప్రత్యేకతలు ఆమ్కా సొంతం. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ఇది సమర్థంగా సత్తా చాటుతుంది.
* 25 టన్నుల బరువుతో తయారుకానున్న దీనిలో కృత్రిమమేధతో నడిపే ఎలక్ట్రానిక్ పైలట్, ఆయుధ వ్యవస్థలు ఉంటాయి. ఇందులో అధునాతన ఏవియానిక్స్, సెన్సర్ ఫ్యూజన్ ఉంటుంది. శత్రు రాడార్లకు దొరక్కుండా దీని అస్త్రశస్త్రాలను అంతర్గతంగా ఉంచడానికి ప్రత్యేక అరలు ఉంటాయి.
* ఆమ్కా బహుళ రీతుల్లో పోరాటం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. భారత వైమానిక దళంతోపాటు నౌకాదళానికీ సేవలు అందించేలా దీన్ని రూపొందిస్తున్నారు. శత్రు గగనతలంపై ఆధిపత్యం సాధించడం, భూతలంపై దాడులు, శత్రువుల గగనతల రక్షణ వ్యవస్థల ధ్వంసం, ఎలక్ట్రానిక్ యుద్ధం వంటి అనేక అవసరాలకు ఇది ఉపయోగపడుతుంది.
* ఈ ఫైటర్ జెట్.. తేలికపాటి పోరాట విమానాలు తేజస్ కలిసి వాయుసేనను బలోపేతం చేయనున్నాయి.
* ఈ లోహ విహంగాన్ని పైలట్ సహితంగా, పైలట్ రహితంగా పనిచేసేలా డిజైన్ చేస్తున్నారు.
* హైదరాబాద్‌కు చెందిన వెమ్ టెక్నాలజీస్ సంస్థ దీని ఆకృతిని తయారుచేసింది.
* ఈ ప్రాజెక్టు ప్రారంభ అభివృద్ధి వ్యయం దాదాపు రూ.15 వేల కోట్లుగా అంచనా వేశారు. బహుళ సేవలు అందించే 114 యుద్ధవిమానాలను కూడా 1,800 కోట్ల డాలర్ల వ్యయంతో వాయుసేన సమకూర్చుకోబోతోంది. ఇటీవలి ఏళ్లలో సైనికపరంగా ఇదొక భారీ కార్యక్రమం.
* ఆమ్కా యుద్ధవిమానాలను 2034 నాటికి వైమానిక దళంలోకి చేర్చాలన్నది లక్ష్యం.
* ప్రస్తుతం ఐదో తరానికి చెందిన స్టెల్త్ యుద్ధవిమానాలు ఎఫ్22, ఎఫ్35 (అమెరికా), జె20, జె35 (చైనా) మాత్రమే వినియోగంలో ఉన్నాయి. ఎస్‌యూ 57 పేరుతో రష్యా కూడా ఈ తరహా ఫైటర్‌జెట్‌ను రూపొందించింది. వీటికి పోటీగా ఆమ్కా నిలవనుంది.
* ఆమ్కా తయారీ ప్రక్రియకు హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) నేతృత్వం వహిస్తుంది. రక్షణ శాఖ ఆమోదించిన నమూనా ప్రకారం.. గణనీయ స్థాయిలో ప్రైవేటు భాగస్వామ్యానికి వీలుంటుంది. తద్వారా ఉత్పత్తి ప్రక్రియ వేగవంతమవుతుందని నిపుణులు చెబుతున్నారు.
* తొలివిడతగా ఉత్పత్తి చేసే మార్క్ 1 శ్రేణి ఆమ్కా జెట్‌లలో అమెరికాకు చెందిన జీఈ414 ఇంజిన్లు ఉపయోగిస్తారు. మార్క్ 2లో మాత్రం దేశీయంగా అభివృద్ధి చేసే మరింత శక్తిమంతమైన ఇంజిన్లను ఉపయోగించే అవకాశం ఉంది. విదేశీ భాగస్వామ్యంతో ఈ ఇంజిన్లను రూపొందించాలని భారత్ తలపోస్తోంది.

## అందాల పోటీల ఫైనల్‌కి కౌంట్‌డౌన్

(మొదటి పేజీ తరువాయి)

ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో క్వార్టర్స్‌కు చేరారు. మిగతా 26 మందిని అమెరికా కరేబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియాఓషియానా ఖండాల వారీగా న్యాయనిర్ణేతలు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇండోనేసియా, వేల్స్ భామలు రెండు పోటీల్లో విజేతలుగా నిలిచారు. ఆ ప్రకారం టాప్40లో ఇప్పటివరకు 12 బెర్తులు మాత్రమే ఖరారయ్యాయి. అంటే ఇంకా 28 మందిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. టాప్ 40లో కూడా ఒక్కో ఖండం నుంచి పది మంది ఉండేలా ఎంపిక చేస్తారు. ఆ తర్వాతి రౌండ్‌లో వీరిలోంచి టాప్ 20ని తీసుకుంటారు. ఒక్కొక్క ఖండం నుంచి ఐదుగురు ఉంటారు. ఇక అంతిమ ఘట్టానికి ముందు టాప్ 8 అంటే ఒక్కో ఖండం నుంచి ఇద్దర్ని ఎంపిక చేస్తారు. ఆ తర్వాత ఒక్కో ఖండం నుంచి ఒక్కొక్కరే అంటే నలుగురు అంతిమంగా కిరీటం కోసం మిగులుతారు. వీరిలో ఒకరు విజేతగా, మిగిలిన ముగ్గురు ఒకటి, రెండు, మూడో రన్నరప్‌గా నిలుస్తారు.

**3,500 మంది అతిథులు వస్తారని అంచనా..**

హైదరాబాద్ హైటెక్స్‌లో కొత్తగా నిర్మించిన నాలుగో హాల్‌లో 31న జరిగే ఫైనల్ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సైబర్ పోలీసులు, ట్రాఫిక్ విభాగం, పర్యాటక శాఖ, నిర్వాహకులు ఈ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. హాల్ సామర్థ్యం 3,500 మంది కావడంతో అంతమంది అతిథులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఫైనల్ వేడుకలు సాయంత్రం నుంచే మొదలవుతాయి. తుది పోటీలు రాత్రి 10 నుంచి అర్ధరాత్రి వరకు జరగనున్నాయి.

## పద్మాలు అందుకున్న ప్రముఖులు

దిల్లీ: వివిధ రంగాల్లో చేసిన విశేష సేవలకుగాను కేంద్రం ఈ ఏడాది ప్రకటించిన పద్మపురస్కారాలను పలువురు ప్రముఖులు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జగదీష్ సింగ్ కేహర్, కతక్ నృత్యకారిణి కుముదిని లఖియా తరఫున మనుమడు సహాన్ హత్తంగడి, సంగీతకారిణి శారదా సిన్హా తరఫున కుమారుడు అన్షుమన్‌సిన్హా (ఇద్దరికీ మరణానంతరం)లు పద్మవిభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. ప్రముఖ బహుభాషా నటి శోభనా చంద్రకుమార్, పట్టువస్త్రాల వ్యాపార దిగ్గజం నల్లి కుప్పుస్వామిచెట్టి, ఆర్థికవేత్త బిబేక్ డెబ్రాయ్ తరఫున సతీమణి సుపర్ణ బెనర్జీ (మరణానంతరం), ప్రముఖ ఆర్కియాలజిస్ట్ కైలాస్‌నాథ్ దీక్షిత్, సాహిత్య అకాడమీ వ్యవస్థాపకులు జతిన్‌గోస్వామి, మాజీ లోక్‌సభ స్పీకర్ మనోహర్‌జోషీ తరఫున కుమారుడు ఉన్మేష్ జోషీ (మరణానంతరం), ప్రముఖ నటులు అనంతనాగ్, ప్రముఖ పాత్రికేయులు రాంబహదూర్‌రాయ్, దీదీమాగా పేరొందిన ఆధ్యాత్మిక వేత్త సాధ్వీ రితంభరలు పద్మభూషణ్ స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సాహిత్యం, విద్యారంగాల నుంచి కేఎల్ కృష్ణ, వాచస్పతి వాదిరాజ్ రాఘవేంద్రాచార్య పంచముఖి, తెలంగాణ నుంచి ప్రజావ్యవహారాల విభాగంలో మంద కృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డులు స్వీకరించారు.



## మళ్లీ ఏపీ హైకోర్టుకు జస్టిస్ బట్టు దేవానంద్

(మొదటి పేజీ తరువాయి)

స్వస్థలం గుడివాడ. ఆంధ్రా యూనివర్సిటీ లా కాలేజీ నుంచి బీఎల్ డిగ్రీ పొందారు. 1989 జులై 6న బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. విశాఖపట్నం జిల్లా కోర్టులో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లింగంపల్లిలో 1967 నవంబరు 7న అభిషేక్‌రెడ్డి జన్మించారు. ఉస్మానియా లా కాలేజీలో న్యాయశాస్త్రంలో పట్టా పొంది, 1990లో బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. సివిల్, క్రిమినల్, రాజ్యాంగ కేసుల్లో నైపుణ్యం సాధించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, జేఎన్‌టీయూ స్టాండింగ్ కౌన్సిల్‌గా, హెచ్‌ఎండీఏ, ఇంటర్ బోర్డు, బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తరఫున కేసులు వాదించారు. 2019 ఆగస్టు 26న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. 2023 మే 15న పట్నా హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. తిరిగి రెండేళ్లకు మళ్లీ తెలంగాణ హైకోర్టుకే బదిలీపై వస్తున్నారు. బాపట్ల జిల్లా జమ్ములపాలెంలో లలిత జన్మించారు. న్యాయశాస్త్రంలో పట్టా పొంది 1994లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. సివిల్, క్రిమినల్, రాజ్యాంగం, ట్యాక్స్, సర్వీసు, నాన్‌సర్వీసు తదితర రంగాల్లో నైపుణ్యం సాధించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ఇఫ్లూ, తితిదే, దేవాదాయ, శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, స్విమ్స్, తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయాలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. 2020 మే 2న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 నవంబరు 15న తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2023 జులై 28న కర్ణాటక హైకోర్టుకు బదిలీపై వెళ్లారు. తిరిగి తెలంగాణ హైకోర్టుకు బదిలీపై వస్తున్నారు. నెల్లూరులో 1972 ఫిబ్రవరి 5న సుమలత జన్మించారు. 1995లో తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. జిల్లా జడ్జిగా 2007లో ఎంపికై కర్నూలు, మదనపల్లె, అనంతపురం, గుంటూరులలో పనిచేశారు. జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా, సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జిగా విధులు నిర్వర్తించారు. 2021 అక్టోబరు 14న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 2023 నవంబరు 23న కర్ణాటక హైకోర్టుకు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం సిఫారసు చేసింది.

## ఏపీ దశ, దిశ మారుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

దేవుని కడపలో నిర్వహిస్తున్న తెదేపా మహానాడు చరిత్ర సృష్టించబోతోందని.. ఆంధ్రప్రదేశ్ దశ, దిశ నిర్దేశించబోతోందని ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించారు. ఈ మహానాడులో అనేక విషయాలు చర్చించి భావితరాల భవిష్యత్తుకు అవసరమైన విధానాలు రూపొందిస్తామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చాక 78 ఏళ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో.. రాబోయే 22 ఏళ్లలో అంతకు రెట్టింపు అభివృద్ధి జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కడపలో తెదేపా మహానాడుకు చంద్రబాబు మంగళవారం జ్యోతి వెలిగించి శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వైకాపా హయాంలోని విధ్వంస పాలకుల కుంభకోణాల లెక్కలు తీస్తున్నామని.. విచారణకు ఆదేశించామని పేర్కొన్నారు. ఎన్నికల్లో అవినీతి పాలకుల్ని ఓడించి, కూటమిని గెలిపించిన ప్రజలు.. అక్రమార్కులను శిక్షించే బాధ్యత మనకు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజాసంపద దోచుకున్నవారిని, గాడి తప్పిన నాయకుల్ని.. అధికారుల్ని ఉపేక్షించే సమస్య లేదని స్పష్టం చేశారు. ఆలస్యం కావచ్చేమో గానీ, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని తేల్చిచెప్పారు. ‘వైకాపా ప్రభుత్వం చేసిన అవినీతికి అంతే లేదు. ఎవరు అవినీతి చేసినా కక్కించే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటుంది. నేరస్థులు ఎక్కడున్నా వదిలిపెట్టే సమస్య లేదు. నేరస్థులకు ఆంధ్రప్రదేశ్‌లో చోటు లేదని నిరూపిస్తాం’ అని ప్రకటించారు. కార్యకర్తల వల్లే ఇక్కడున్నామని మర్చిపోవద్దు ‘2024 ఎన్నికల్లో ప్రజలు మనకు అపూర్వ విజయం కట్టబెట్టారు. పసుపు సైనికులు, పార్టీ నాయకత్వమే దీనికి కారణం. జనసేన, భాజపాలతో కలిసి కూటమి ఏర్పాటు చేయడం మహా విజయానికి దోహదపడింది. మీ పోరాటం, త్యాగాల ఫలితమే నేటి అధికారం. ఏమీ ఆశించకుండా దశాబ్దాలుగా పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తల వల్లే ఇక్కడున్నామనే విషయాన్ని మంత్రులు, నాయకులంతా గుర్తుంచుకోవాలి’ అని చంద్రబాబు పేర్కొన్నారు. తెదేపా పని అయిపోయిందని గతంలో అన్నవారి పనే అయిపోయిందని.. తెదేపా జెండా ఎప్పుడూ రెపరెపలాడుతూనే ఉందని అధినేత వ్యాఖ్యానించారు. చిట్టచివరి కార్యకర్త కూడా ప్రభుత్వంలో భాగస్వామి కావాలని, వారి ద్వారా పాలన జరిగినప్పుడే నిజమైన పొలిటికల్ గవర్నెన్స్ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రసంగంలో ముఖ్యాంశాలివీ..

## ఈసారి వర్షాలు పుష్కలం!.. ఐఎండీ అంచనా

(మొదటి పేజీ తరువాయి)

జూన్ నెలలో సాధారణం కంటే ఎక్కువ వానలు కురిసి, గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని వెల్లడించింది. దీర్ఘకాలిక సగటు (166.9 మి.మీ.)తో పోలిస్తే 108% వర్షాలు కురుస్తాయని తెలిపింది. జూన్ నుంచి సెప్టెంబరు మధ్య సగటు (87 మి.మీ.) కంటే 106% వర్షపాతం నమోదవుతుందని పేర్కొంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, చుట్టుపక్కల ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా; వాయవ్య భారతదేశంలో సాధారణంగా, ఈశాన్య రాష్ట్రాల్లో తక్కువగా వర్షాలు పడతాయని తెలిపింది. మధ్య, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాల్లో కూడా సాధారణ సగటుకు మించిన వానలు పడతాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. మరోవైపు పసిఫిక్ ప్రాంతంలో ఎల్‌నినో తటస్థంగా ఉంది. ఈసారి రుతుపవనాలపై ఎల్‌నినో ప్రభావం చూపబోదని ఐఎండీ తెలిపింది.

**తేరుకున్న ముంబయి.. కేరళ ఉక్కిరిబిక్కిరి**

రుతుపవనాలు వచ్చీ రావడంతోనే కుండపోత వానలు పడిన ముంబయిలో 24 గంటల వ్యవధిలో 106 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. సోమవారంతో పోలిస్తే మంగళవారం పరిస్థితి కొంత మెరుగుపడింది. సబర్బన్ రైళ్లు, బస్సులు ఆలస్యంగానైనా నడుస్తున్నాయి. దక్షిణ ముంబయిలోని పలు ప్రాంతాలు ఇంకా వరదనీటిలోనే ఉన్నాయి. కేరళలో భారీ వానలు మంగళవారం కూడా సాధారణ జనజీవనాన్ని స్తంభింపజేశాయి. వృక్షాలు కూలిపోయి రైలుపట్టాలపై పడటంతో అనేక రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. నీటమునిగిన ప్రాంతాల నుంచి ప్రజల్ని పడవల్లో తరలిస్తున్నారు. తిరువనంతపురం సమీపంలోని కల్లార్ వద్ద భారీ కొండచరియలు విరిగిపడటంతో రహదారులపై రాకపోకలకు అంతరాయం తప్పలేదు. మహారాష్ట్రలోని మరాఠ్వాడా ప్రాంతంలో వరద ఉధృతికి కొట్టుకుపోవడం వల్ల నలుగురు, విద్యుదాఘాతం వల్ల ఒకరు చనిపోయారు.

## ఉగ్రవాదమే పాకిస్థాన్ యుద్ధనీతి

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబం అన్న భావన మన సంస్కారం..మన పొరుగువారి సంతోషాన్నీ మనం కోరుకుంటాం. మన బలాన్ని సవాలు చేస్తే..మనదేశం వీరుల గడ్డ అని కూడా చూపిస్తాం’’ అని మోదీ తెలిపారు. గుజరాత్ పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం గాంధీనగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మోదీ పాల్గొని ప్రసంగించారు.




# సౌర శక్తి, నిర్వహణ, భద్రత మరియు EV సాంకేతిక అవగాహన కార్యక్రమం

నర్సాపూర్ మే 27, (సమయం న్యూస్) : ఎలక్ట్రానిక్స్ విభాగం మరియు ఐఈఈఈ ఎస్ బి & పీ ఈ ఎస్ సొసైటీ వారి బాగస్వామ్యము తో ఐ టి ఐ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు మరియు పట్టణ, గ్రామీణ ప్రజలకు ప్రజా ప్రయోజనాల కోసం ఒక వారం ఉచిత ఔట్రీచ్ శిక్షణా కార్యక్రమాన్ని బి వి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజ్ లో నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే సమావేశంలో మాట్లాడుతూ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తు సమాజ ప్రయోజనం కోసం ఈ రకమైన కార్యకలాపాలను నిర్వహిస్తున్నందుకు ఇ ఇ ఇ విభాగం హెచ్ఓడి డాక్టర్ కె రాయుడిని అభినందించారు. ఈ శిక్షణా కార్యక్రమం లో ఔత్సాహిక వ్యక్తులు మరియు ఔత్సాహికుల లో అవగాహన మరియు సాంకేతిక అవగాహనను ప్రోత్సహించడం రంగాలను లక్ష్యంగా పెట్టుకుంది అని అన్నారు సౌర విద్యుత్ ఉత్పత్తి , వినియోగం, సౌర వ్యవస్థల నిర్వహణ , విద్యుత్ భద్రతా చర్యలు, విద్యుత్ వాహన సాంకేతికత మరియు దాని




అనుసంధాన మైన అనువర్తనాలు , క్లీన్ ఎనర్జీ మరియు ఇ వి ల ద్వారా కార్బన్ ఉద్గారాల పైన సోలార్ పవర్, నిర్వహణ, సేఫ్టీ మరియు ఇ వి టెక్నాలజీ అవగాహన కార్యక్రమం ఉచితంగా అందిస్తున్నామని వాతావరణ అనుకూల సాంకేతికతల పై ప్రజలకు అవగాహన కల్పిస్తుంది ఈ వారం రోజుల ఔట్రీచ్ కార్యక్రమాన్ని ఇ ఇ ఇ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి చంద్రబాబు సమన్వయం చేస్తారు ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ యచ్ ఓ డి డా.కాటూరి రాయుడు కళాశాల మేనేజర్ శ్రీ బి. బాపి రాజు మరియు ఎ ఎ ఓ సురేష్ అన్ని ఐటీఐ విద్యార్థులు మరియు గ్రాడ్యుయేట్ విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు



# నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు

* **ఎడిఎ నూతన్ కుమార్**


కంగ్టి, 27 మే, (సమయం న్యూస్) : నకిలీ విత్తనాలు,ఎరువులు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించిన నారాయణఖేడ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అధికారి కె. నూతన్ కుమార్ తెలిపారు. కంగ్టి మండల కేంద్రంలోని విత్తనాలు,ఎరువులు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రైతులు విత్తనాలు,ఎరువులు కొనుగోలు చేసిన తరువాత దుకాణం యజమాని దగ్గర అడిగి రసీదు తీసుకోవాలని అన్నారు. ఈసారి వానాకాలం సీజన్లో ముందుగానే రూతుపావనాలు రావడం సంతోషదాయకం రైతులు వర్షం 60 మిల్లీలీటర్లు పడ్డ తర్వాతనే విత్తనాలను వితుకోవలసినదిగా రైతులకు తెలియజేశారు. విత్తనా దుకాణంలో అన్ని రకాల పత్తి విత్తనాలు అందుబాటులో ఉంచడం జరిగింది రైతులకు నకిలీ విత్తనాలు



గాని లూజుగా దొరికే విత్తనాలు గాని అమ్మితే కఠిన చర్యలు తప్పవు రైతులు విత్తనాలు కొనేటప్పుడు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ కొనుగోలు చేయాలనీ అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత రసీదు తప్పనిసరిగా పంట కాలం అయిపోయేంతవరకు భద్రపరచుకోవాలని అన్నారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలనీ అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒక్కరూ మృతి

జిన్నారం, మే 27, సమయం న్యూస్ : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిందని సిఐ రవీందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం బొల్లారం గ్రామ శివారులోని ఔటర్ రింగ్ రోడ్డు పైన టైర్ పంచర్ తో లారీ ఆగిపోయింది.లారీ క్లీనర్ హిజాజ్ (36) టైర్ ను మార్చే క్రమంలో , వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొనడంతో లారీ క్లీనర్ హిజాజ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ ఇక్బాల్ భగవాన్




కు కూడా తీవ్ర గాయాలయ్యాయి, అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారని తెలిపారు. మృతుని బంధువు అబేద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# మురుగు కాలువల్లో యుద్ధప్రాతిపదికన పూడిక తొలగింపు పనులు

* **క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే**
* **వర్షపు జలాలు నిలువ ఉండకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం**

నిజామాబాద్, మే 27 ( సమయం న్యూస్): జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, ఆయా నివాస ప్రాంతాలలో గల మురుగు కాలువల్లో వర్షపు జలాలు నిలువ ఉండకుండా పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి స్థాయిలో శుభ్రం చేయించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షపు జలాలతో చెత్తాచెదారం మురుగు కాలువల్లోకి చేరి, పూడిక వల్ల ముందుకు వెళ్లే అవకాశం లేక నగరంలోని పలు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయని అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు తదితరులతో కలిసి కలెక్టర్ నగరంలోని పలు సమస్యాత్మక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ముఖ్య కూడళ్లలో ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్న



డ్రైనేజీల స్థితిగతులను పరిశీలించారు. బైపాస్ రోడ్డులోని ఉర్దూ మీడియం స్కూల్ సమీపంలోని డ్రైనేజీని, నిజామ్ కాలనీలోని డ్రైనేజీని, బోధన్ రోడ్ లోని రిలయన్స్ పెట్రోల్ బ్యాంకు సమీపంలో గల మురుగు కాల్వను, రాజరాజేంద్ర చౌరస్తా నుండి పీ.ఎఫ్ కార్యాలయం వరకు గల డ్రైనేజీని, సాయినగర్ రోడ్ నెంబర్ 1 లో గల మురుగు కాల్వను, తీన్ కమాన్ నుండి ఐ.డీ.ఓ.సి వరకు గల డ్రైనేజి, వినాయకనగర్ లోని బస్వా గార్డెన్ సమీపంలో గల మురుగు కాల్వను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కొత్తగా నిర్మించదల్చిన మురుగు కాల్వల ప్రతిపాదిత స్థలాలను సందర్శించి మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. పలుచోట్ల డ్రైనేజీలను ఆక్రమించుకుని నిర్మాణాలు కలిగి ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. వర్షాకాలంలో నగరంలోని ఏ ఒక్క ప్రాంతం కూడా జలమయంగా మారకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా మురుగుకాలువల్లో పేరుకుపోయిన పూడికతో పాటు చెత్తా, చెదారం తొలగింపజేయాలని, ఎక్కడ కూడా వర్షపు నీరు నిలువ ఉండకుండా ముందుకు ప్రవహించేలా డ్రైన్లను శుభ్రం చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. భారీ వర్షాలు కురియకముందే డీ సిల్టింగ్ పనులను పూర్తి చేయించాలని సూచించారు. అవకాశం ఉన్నచోట జేసీబీ వంటి యంత్రాలను వినియోగించాలని, వీలుకాని చోట పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించాలన్నారు. నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీల పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, సకాలంలో పూర్తి చేసేలా పర్యవేక్షణ జరపాలన్నారు. ఇదివరకు వర్షాలు కురిసిన సమయాలలో వరద తాకిడికి గురైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. డ్రైన్లలోకి చేరే వర్షపు జలాలు పూడిక కారణంగా ఎక్కడికక్కడ నిలిచిపోవడం వల్లే పలు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు పూడికతీత పనులను పక్కాగా జరిపించాలని అధికారులను ఆదేశించారు. నగర ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఈ.ఈ ఆనంద్ సాగర్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రతి గల్లీని క్లీన్ గా ఉంచడమే ఫ్రీ మాన్సూన్

# శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ముఖ్య ఉద్దేశ్యం

: **మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

హైదరాబాద్, మే 27: ప్రతి గల్లీని క్లీన్ గా తీర్చిదిద్దడమే ఫ్రీ మాన్సూన్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ముఖ్య ఉద్దేశ్యమని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. హైదరాబాద్ నగరాన్ని క్లీన్ గా ఉంచడమే ధ్యేయంగా ఫ్రీ మాన్సూన్ స్పెషల్ డ్రైవ్ ను నగర్ వ్యాప్తంగా ఉన్న 150 వార్డులో యుద్ధ ప్రాతిపదికన కొనసాగించడం జరుగుతుందన్నారు. ఫ్రీ మాన్సూన్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా మంగళవారం ఎల్బీనగర్ జోన్ లోని కార్పొరేటర్లు, అధికారులతో మేయర్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... ఒక్కొక్క వార్డులో మూడు లేదా నాలుగు రోజుల్లో గల్లీ గల్లీ క్లీన్ చేయడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క వార్డును పూర్తి చేసిన తర్వాత ప్రజలు చెత్త బయట వేసిన సందర్భంలో ఫైన్ వేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికి స్వచ్ఛ ఆటోతో లింక్ చేయడం జరిగిందని, వారు స్వచ్ఛ ఆటో డ్రైవర్ కు నెల నెల నిర్దేశించిన రుసుం ఇవ్వకున్నా తప్పనిసరిగా స్వచ్ఛ ఆటో కే వేసే విధంగా డిప్యూటీ కమిషనర్లు, శానిటేషన్ అధికారులు వారికి అవగాహన కల్పిస్తున్నారని మేయర్ తెలిపారు. చెత్తతో పాటు భవన నిర్మాణ వ్యర్థాలు డ్రైనేజీ క్లీనింగ్ కూడా చేస్తారని, ఈ విషయంలో జలమండలి అధికారులు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ముందస్తు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ వలన పరిశుభ్రత వలన ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా చర్యలు






తీసుకుంటున్నామని, ప్రజలందరూ సహకరించాలని మేయర్ కోరారు. ఎల్బీనగర్ నగర్ జోన్ లో కార్పొరేటర్లు, అధికారులతో సమావేశం అనంతరం మేయర్ మీడియా తో మాట్లాడుతూ... కార్పొరేటర్లు వారి వారి వార్డులో ఉన్న సమస్యలను విన్నవించారని, వాటిని యుద్ధ ప్రాతిపదిక పరిష్కారం చేస్తామన్నారు. ముఖ్యంగా పార్కుల అభివృద్ధి శానిటేషన్, స్టార్మ్ వాటర్ నాలా, నాలా అభివృద్ధి, సిసి రోడ్ల సమస్యలు విన్నవించారని, కొన్ని సమస్యలు జోనల్ స్థాయిలో పరిష్కారం అయ్యే అవకాశం ఉందని మరికొన్ని హెడ్ ఆఫీస్ పరిధిలో ఉన్నాయని, తాను జీహెచ్ఎంసీ కమిషనర్, వివిధ విభాగాల హెచ్ఓడి లతో సమావేశం ఏర్పాటు చేసి అవసరమైతే ప్రభుత్వ దృష్టి తీసుకుపోతామన్నారు. ముఖ్యంగా కొన్ని కాలనీలు పెరుగుతున్న నేపథ్యంలో శానిటేషన్ కార్మికుల సంఖ్య పెంచాలని కోరారని చెప్పారు. అదే విధంగా ఎస్.ఎఫ్.ఏ లు దీర్ఘకాలికంగా ఒకే చోట పని చేస్తున్నారని, వారిని బదిలీ చేయాలని మెజారిటీ కార్పొరేటర్లు కోరినట్లు మేయర్ వివరించారు. వీధి లైట్ల పై కూడా సమస్యలు విన్నవించారని, గతంలో ఉన్న ఈ ఈ ఎస్ ఎల్ కాంట్రాక్ట్ పూర్తి అయినందున వారి సబ్ కాంట్రాక్టర్లలతో కొంత కాలం జిహెచ్ఎంసి నిర్వహిస్తున్నారు. కొందరు కార్పొరేటర్లు విద్యుత్ శాఖ నుండి వచ్చిన ఎలక్ట్రికల్ ఇంజనీర్ లు డిప్యూటేషన్ పై రావడంతో వారికి జీతాలు ఎక్కువ మొత్తంలో చెల్లిస్తున్నారని, అయినా వారితో ఏమి లాభం లేకుండా పోతున్నారని, వీధి దీపాల నిర్వహణ ఇంజనీరింగ్ మెయింటెనెన్స్ కు బాధ్యత ఇవ్వాలని కోరారు. త్వరలో కమిషనర్ స్టాండింగ్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రతి పనిలో అధికారులు కార్పొరేటర్లను ఇన్వాల్వ్ చేయాలని, ఏ పని చేపట్టిన కార్పొరేటర్ల కు సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు మేయర్ వెల్లడించారు. కుక్కల బెడద నివారణకు అన్ని చర్యలు తీసుకున్నట్లు దేశంలో మరెక్కడా లేని విధంగా జీహెచ్ఎంసీ ఎక్కువ శాతం కుక్కలకు స్టెరిలైజేషన్ చేసినట్లు వివరించారు. అంతకు ముందు జరిగిన సమావేశంలో మేయర్ మాట్లాడుతూ... ఎల్బీనగర్ జోన్ లో అధిక నిధులు మంజూరు చేసినట్లు అయినప్పటికీ మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మేయర్ ఎల్బీనగర్ జోన్ కు వచ్చిన సందర్భంగా కార్పొరేటర్ ఒక్కరికి 50 లక్షల రూపాయలు మంజూరు చేయాలని కార్పొరేటర్లు మేయర్ ను కోరారు. ఈ సమావేశంలో జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ... కార్పొరేటర్ లు సూచించిన అంశాలను క్షేత్రస్థాయిలో, పర్యటించి జోనల్ స్థాయిలో పరిష్కారం అయ్యే వాటికి పరిష్కరిస్తామని అవసరమైన నిధుల కోసం కమీషనర్ గారికి నివేదించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎస్.ఈ అశోక్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ లు, కార్పొరేటర్లు కొప్పుల నరసింహ రెడ్డి, కె.నవజీవన రెడ్డి, ఎం.లచ్చి రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, వంగా మధుసూదన్ రెడ్డి, శ్రీమతి అరుణ, శ్రీమతి బానోతు సుజాత, ఆకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


# జూన్ 3 నుండి రెవెన్యూ సదస్సుల కు పటిష్టమైన ఏర్పాట్లు

* **జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ ఓవర్**

సూర్యాపేట మే 27 (సమయం న్యూస్) : భూభారతి లో భాగంగా జూన్ 3 నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సులకు ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే ప్రాంతాలను పరిశీలించి గ్రామసభలు పెట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఆర్డీవోలు, తాసిల్దార్లు, జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో జూన్ 3 నుండి ప్రారంభమయ్యే రెవెన్యూ సదస్సులు నిర్వహించే ప్రాంతం ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలని, దరఖాస్తులు స్వీకరించేటప్పుడు దరఖాస్తు తో పాటుగా రైతు యొక్క భూములకు సంబంధించిన




పత్రాలు తప్పక ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించేటప్పుడు ముందుగా జరగబోయే గ్రామంలో ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని ప్రతిరోజు టీమ్స్ టైం ప్రకారం గ్రామ సభల నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. తప్పకుండా టీమ్స్ వెళ్లేటప్పుడు సిస్టమ్స్, ప్రింటర్స్ తీసుకుని వెళ్లాలన్నారు, దరఖాస్తులు రైతుల నుండి స్వీకరించే సిబ్బంది రైతుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ విలేజ్ ప్రొఫైల్ తప్పక తయారు చేయాలని తాసిల్దార్లకు కలెక్టర్ తెలిపారు. అన్ని రెవెన్యూ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఏర్పరుచుకోవాలని కలెక్టర్ తెలిపారు. మూడు నెలల సన్న బియ్యాన్ని చౌక దుకాణాలకు పంపడం జరుగుతుందని రెవెన్యూ అధికారులు సన్న బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతిరోజు fp షాపులను తనిఖీ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులో పేర్లు చేర్పులు మార్పులు విషయంలో కార్డుల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు పెట్టవద్దని తాసిల్దార్ కు కలెక్టర్ తెలిపారు. ధాన్యం సేకరణ రైస్ మిల్లుల పరిశీలన తప్పక చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని రెవెన్యూ కార్యాలయంలో సర్టిఫికెట్స్ మంజూరి విషయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రక్రియ సజావుగా జరగాలని ,అన్ని కార్యాలయంలో సర్టిఫికెట్స్ మంజూరి కొరకు ఒక అధికారి దీని కొరకు ప్రత్యేకంగా నియమించాలని కలెక్టర్ సూచించారు .జూన్ 3 నుండి జూన్ 20వ తేదీ వరకు జరిగే రెవెన్యూ సదస్సుల కు అవసరమైన చోట పోలీసు సిబ్బందిని బందోబస్తు నిమిత్తం ముందుగా తెలపాలని సూచించారు. ఈ సమావేశంలో సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్ కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణ హుజూర్నగర్ ఆర్డిఓ శ్రీనివాసులు అన్ని మండలాలకు చెందిన తాసిల్దార్లు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## సంక్షేమ నేత, కుత్బుల్లాపూర్ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ గారికీ పలు ఆహ్వానాలు, వినతులు

కుత్బుల్లాపూర్, మే27, సమయం న్యూస్ : ఈరోజు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే గారి నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ గారిని కలిసి పలు ఆహ్వానాలు అందజేయగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు సానుకూలంగా స్పందించారు.

# ఔటర్ రింగ్ రోడ్డు నుండి కొండాపూర్ఫ్లై ఓవర్ త్వరలో ప్రారంభం


* **ట్రాఫిక్ కష్టాలకు చెల్లు!**

హైదరాబాద్, మే 27( సమయం న్యూస్) ఔటర్ రింగ్ రోడ్డు నుండి కొండాపూర్ ఫ్లైఓవర్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నగరవాసులకు, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో ప్రయాణించే వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఔటర్ రింగ్ రోడ్డు (ORR) నుండి కొండాపూర్‌కు వెళ్లే అత్యాధునిక మల్టీ లెవెల్ ఫ్లైఓవర్ నిర్మాణం దాదాపు పూర్తయింది. ఈ ఫ్లై ఓవర్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి జూన్ మొదటి వారంలో ప్రారంభించనున్నారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుంది, ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది.

**ప్రాజెక్టు వివరాలు:**

ఈ ఫ్లైఓవర్‌ను రూ.178 కోట్ల వ్యయంతో స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (SRDP) కింద నిర్మించారు. 1.2 కిలోమీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పుతో ఆరు లేన్లతో ఇది అందుబాటులోకి రానుంది. దీని ప్రత్యేకత ఏమిటంటే, ఇది ఇప్పటికే ఉన్న రెండు ఫ్లైఓవర్లపై నిర్మించిన మూడవ స్థాయి నిర్మాణం. కింద గచ్చిబౌలి జంక్షన్ ఫ్లైఓవర్, దానిపై శిల్పా లేఅవుట్ ఫేజ్ 1 ఫ్లైఓవర్ ఉండగా, ఇప్పుడు దానికి పైన ఫేజ్ 2 ఫ్లైఓవర్ నిర్మించారు.

* **ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి**



గచ్చిబౌలి జంక్షన్ వద్ద తీవ్రమైన ట్రాఫిక్ సమస్యను ఈ ఫ్లైఓవర్ చాలా వరకు తగ్గిస్తుంది. మెరుగైన కనెక్టివిటీ: ORR నుండి కొండాపూర్, హఫీజ్‌పేట్ మార్గాల్లో వెళ్లే వాహనాలకు ఇది చాలా అనుకూలంగా ఉంటుంది. హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు మెరుగైన కనెక్టివిటీ లభిస్తుంది. ప్రయాణ సమయం ఆదాతో పాటు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా వేగంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. కొండాపూర్ ప్రాంతం నుండి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ అక్కడి నుండి కొండాపూర్ ప్రాంతాలకు వెళ్ళేందుకు గచ్చిబౌకోవద్ద ఎలాంటి ట్రాఫిక్ జామ్ లేకుండా నేరుగా వెళ్లి వెసులుబాటు కలదు. జీహెచ్ఎంసీ అధికారులు ఈ ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేశారు. గతంలో కొన్ని కారణాల వల్ల ఆలస్యం అయినప్పటికీ, పనులు ప్రస్తుతం తుది దశలో ఉన్నాయి. ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసి, త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఫ్లైఓవర్ ప్రారంభం హైదరాబాద్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒక ముఖ్యమైన అడుగు అవుతుంది. ఈ ఫ్లై ఓవర్ ను పూర్తి చేయడానికి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పలు సార్లు పర్యటన చేసి వేగవంతంగా పూర్తి చేయుటకు ప్రాజెక్టు ఇంజనీర్లను ఆదేశించారు. ఎస్.ఆర్.డి.పి ద్వారా హైదరాబాద్ లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేసిన నేపథ్యంలోఈ ప్రాజెక్టు ద్వారా 23వ ఫ్లై ఓవర్ అందుబాటులోకి రానున్నది. ఎస్.ఆర్.డి.పి ద్వారా చేపట్టినా ఫ్లై ఓవర్ లు నగరంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా నేరుగా నిర్దేశించిన సమయంలో గమ్య స్థానానికి చేరుకోవచ్చు. సి.ఆర్.ఎం.పి ద్వారా, ఎస్.ఆర్.డి.పి ద్వారా చేపట్టిన పనులు పూర్తి కావడంతో గతంలో కంటే ఎక్కువ వేగంగా వెళ్లేందుకు స్పీడ్ పెంచడం జరిగింది. ఎస్.ఆర్.డి.పి ద్వారా చేపట్టిన మొత్తం 42 పనులలో ఈ ఫ్లై ఓవర్ తో 37 పనులు పూర్తి అయ్యాయి. ఫలక్నుమా రైల్వే ఓవర్ బ్రిడ్జి ,శాస్త్రి పురం ఆర్.ఓ బి పనులు రైల్వే పోర్షన్ రెండు మూడునెలలు లో పూర్తి చేయాలని టార్గెట్ నిర్ణయించి కమిషనర్ ఆర్.వి కర్ణన్ రైల్వే అధికారులను కోరారు. వారికి జులై నెల చివరి వరకు ఫలక్ నూమా ఆర్.ఓ.బి, ఆగస్టు నెల చివరి వరకు శాస్త్రిపురం ఆర్.ఓ.బి పనులను పూర్తిచేయాలని కమీషనర్ టార్గెట్ పెట్టారు. ఈ రెండు ఆర్.ఓ.బి లు పూర్తయితే ఎస్.ఆర్.డి.పి పనులు 39 పనులు పుటవుతాయి.. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనదారులు వెళ్లవచ్చు.

**హెచ్ సిటీ**

అది అలా ఉండగా ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి రావడం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేశారు. గతంలో జీహెచ్ఎంసి కి ఇచ్చిన హామీ మేరకు నగర అభివృద్ధికి నిధులను మంజూరు చేసి జిహెచ్ఎంసి కి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో నగర అభివృద్ధికి హెచ్ సిటీ ద్వారా రూ. 7032 కోట్ల వ్యయంతో 58 పనులు చేపట్టనున్నారు. అందులో 28 ఫ్లైఓవర్లు, 13 అండర్ పాస్ లు, ఆర్.ఓ.బీ లు 4, రైల్వే అండర్ బ్రిడ్జి 03, రోడ్డు వెడల్పు 10 పనులను చేపట్టేందుకు ప్రతిపాదించారు. ఈ పనులను టెండర్ దశ పూర్తిచేసి అగ్రిమెంట్ దశలో కలవు. ఈ పనులను కొన్ని జూన్ మాసంలో ప్రారంభమయ్యే అవకాశం కలదు.




## ఆకతాయిలను అరికట్టాలని పిర్యాదు

- **మైనర్ లు వాహనాలు నడపకుండా చూడాలి**
- **గుండ్ల మహేందర్ రెడ్డి**

జిన్నారం, మే 27, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీలో ఆకతాయి కుర్రాళ్ళు అధిక శబ్దం చేసే వాహనాలను నడుపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంగళవారం కాంగ్రెస్ నాయకుడు గుండ్ల మహేందర్ రెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఆయన కథనం ప్రకారం బొల్లారంలో అధిక శబ్ధం చేస్తూ మైనర్ లు వాహనాలు నడుపుతున్నారని ,మహిళలు, అధికంగా జనాలున్న ప్రదేశంలో పెద్ద,పెద్ద శబ్దాలు చేస్తూ వాహనాలు నడుపుతున్నారని, ఒకే వాహనంపై ముగ్గురు, నలుగురు వ్యక్తులు వెళుతూ పట్టాకుల పేలే శబ్దాన్ని వచ్చేటట్టు వాహనాలను తయారు చేయించుకున్నారని వారు అన్నారు. ఇటువంటి వ్యక్తులను గుర్తించి పోలీసులు కౌన్సిలింగ్ ఇవ్వాలని వారు పేర్కొన్నారు .రాత్రి సమయాల్లో వీధుల వెంట తిరగడంతో విపరీతమైన శబ్దాలు వస్తున్నాయని వారు పేర్కొన్నారు. ఇలాంటి వాహనాలను గుర్తించి సీజ్ చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

# బస్సు అగ్ని ప్రమాద ఘటనలో ప్రయాణికులను కాపాడిన జిల్లా యంత్రాంగం

* **కృతజ్ఞతలు తెలిపిన ప్రయాణికులు.**

కాళేశ్వరం మే27( సమయం న్యూస్) : సిరిసిల్ల నుండి సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరానికి బయలుదేరిన ప్రయివేటు ఏసీ బస్సు 36 మంది ప్రయాణీకులతో వెళుతుండగా, సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో మహాదేవపూర్ మండలం, మద్దులపల్లి దగ్గర షార్ట్ సర్క్యూట్ కారణంగా బస్సులో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటన సమాచారం అందుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ను తక్షణమే సంఘటనా స్థలానికి పంపించారు. అదనపు కలెక్టర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి,





వెంటనే మరొక బస్సును ఏర్పాటు చేసి, ప్రయాణికులను సురక్షితంగా పుష్కర స్నానాలకు పంపించారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ప్రయాణికులకు మంచినీళ్లు ఏర్పాటు చేశారు. అగ్నిమాపక శాఖ తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అనంతరం తిరుగు ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లను చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణహాని జరగకపోవడంతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని అదనపు కలెక్టర్ ఆశోక్ కుమార్ తెలిపారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక అధికారులు సత్వరం స్పందించి రక్షణ చర్యలు చేపట్టి ప్రమాదం నుండి రక్షించారని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.



## అమావాస్య సందర్భంగా బగలాముఖి శక్తిపీఠం దేవాలయంలో హెూమం ప్రత్యేక పూజలు..

* **పబ్బ అంజయ్య రమాదేవి జ్ఞాపకార్థం!**
* **భక్తులకు అన్నదానం.!!**

శివంపేట్ మే 27 (సమయం న్యూస్) : శివంపేట మండల కేంద్రంలో అత్యంత శక్తివంతమైన పీఠంలో ఒకటైన భగలాముఖి శక్తిపీఠం దేవాలయంలో అమావాస్య సందర్భంగా భగలాముఖి అమ్మవారి ఉపాసకులు శాస్త్రులవెంకటేశ్వర శర్మ బాగాలముఖి ట్రస్ట్ సభ్యుల సహకారంతో భగలాముఖిఅమ్మవారికి అభిషేకం హెూమం, ప్రత్యేక పూజలు జరిగాయి. అమావాస్య కావడంతో ఉదయం నుండి భక్తులతో ప్రాంగణమంతా కిటకిటలాడింది. వచ్చిన భక్తులకు పబ్బా అంజయ్య రమాదేవి జ్ఞాపకార్థం వారి కుమారులు పబ్బ రమేష్ గుప్తా సరూప రాణిపుణ్య దంపతులు మరియు మనుమడు పబ్బ మహేష్‌గుప్త స్వాతి పుణ్య దంపతులు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భగలాముఖిట్రస్ట్ సభ్యులు, మరియు స్థానిక మాజీసర్పంచ్ పత్రాలశ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ రాజిపేట పద్మా వెంకటేశ్వర్, పబ్బ మహేష్ గుప్తా యువసేన సభ్యులు ముద్ద గల లక్ష్మి నరసయ్య, వంజరి కొండలు, ముదగల రాజు,, తదితరులు పాల్గొన్నారు.



# సిద్ధాపూర్ రిజర్వాయర్ పనుల పై సమీక్ష చేసిన ప్రభుత్వ సలహా దారు పోచారం శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్ మే 27( సమయం న్యూస్) : హైదరాబాద్ లోని తన కార్యాలయంలో బాన్సువాడ గ్రామీణ మండలం సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులపై,బాన్సువాడ నర్సింగ్ కళాశాల పనులపై, రాష్ట్ర వ్యవసాయ శాఖ అందిస్తున్న పచ్చిరొట్ట ఎరువుల (జిలుగు,పిల్లి పెసర) పంపిణీ కి సంబంధించి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ శ్రీ గోపి గారితో సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎరువులు, పచ్చిరొట్ట (జిలుగు, పిల్లి పెసర) ఎరువులు ముందస్తుగా రైతులకు అందుబాటులో ఉంచాలని ఎక్కడ ఎరువుల కొరత రానివ్వద్దని సూచించారు. రాష్ట్రంలోనే బాన్సువాడ నియోజక వర్గంలో ముందుగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న సందర్భంగా రైతులకు ఎలాంటి కొరత లేకుండా ఎరువులు,పచ్చిరొట్ట ఎరువులు కొరత పంపిణీ చేయాలని సూచించారు. బాన్సువాడ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనుల విషయంలో R&B CE శ్రీ రాజేశ్వర్ గారితో సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణం పూర్తి అయినందున మిగతా చిన్న చిన్న పనులను తొందరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులపై ఇరిగేషన్ CE శ్రీ శ్రీనివాస్ గారితో సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ రిజర్వాయర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. బాన్సువాడ నియోజకవర్గం ప్రధానంగా వ్యవసాయ



ఆధారితం. సిద్ధాపూర్ రిజర్వాయర్ నా ఆశయం, ఈ ప్రాంతంలోని 14,000 ఎకరాల మెట్ట భూములకు పుష్కలంగా నీళ్ళు అందాలి. ఆర్థికంగా రైతులు స్థిరపడాలని నా కల.. భవిష్యత్తులో సిద్ధాపూర్ రిజర్వాయర్ అయకట్ట సస్యశ్యామలంగా ఉండాలి అనేది నా ఉద్దేశ్యం . రూ. 258 కోట్ల రూపాయల వ్యయంతో, ఒక టిఏంసి కెపాసిటీ తో నిర్మిస్తున్నాం. రిజర్వాయర్ కట్టతో పాటుగా పొలాలకు నీళ్ళందించే కుడి, ఎడమ కాలువల పని కూడా త్వరిత గతిన పూర్తి చేయాలి. భవిష్యత్తు తరాల రైతులు సాగునీటికి ఇబ్బందులు లేకుండా పంటలు పండించుకోవాలి. గిరిజనులు, మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు అందించాలని కష్టపడి సిద్దాపూర్ రిజర్వాయర్ కట్టిస్తున్నాము. ఈ సమావేశాలలో ఇరిగేషన్ CE శ్రీ శ్రీనివాస్ గారు, R&B CE శ్రీ రాజేశ్వర్ గారు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి భూలక్ష్మి గారు, ఇతర అధికారులు,కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనికి వెళ్లి తిరిగి వస్తూ వ్యక్తి మృతి

సమయం న్యూస్, యాలాల, మే 27: వికారాబాద్ జిల్లా యాలాల మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన అన్నారం హనుమంతు (38) ఉపాధి హామీ పనికి వెళ్లి మధ్యాహ్నం 11.30 నిమిషాల సమయంలో ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో మార్గ మధ్యలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తన తోటి వారు సహాయం చేయడానికి ప్రయత్నించిన లాభం లేకుండా పోయింది. వెంటనే వారు తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల రోదనలతో ఆసుపత్రి ప్రాంగణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



epaper.samayamdaily.net
APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక



# రీజినల్ రింగ్ రోడ్డుకు ,నిమ్జ్ కు భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

**: జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.**

సంగారెడ్డి మే 27(సమయం న్యూస్) : రీజనల్ రింగ్ రోడ్డు,నిమ్జ్ పూర్తయితే జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. మంగళవారం కలెక్టరేట్ లో మిని సమావేశ మందిరంలో రెవెన్యూ,నిమ్జ్ ప్రత్యేక అధికారు ల తో భూసేకరణ పై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిమ్జ్, రీజినల్ రింగ్ రోడ్డు ఏర్పాటు కోసం అవసరమైన భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. నిమ్జ్ కు 12500 ఎకరాలకి 7500 ఎకరాలు భూ సేకరణ చేసి సేకరించిన భూమికి రక్షణ కంచెను ఏర్పాటు చేయాలన్నారు. రీజినల్ రింగ్ రోడ్ పూర్తయితే రవాణా సులభతరం



అవుతూ విద్య ,వాణిజ్య, వ్యాపార అభివృద్ధి జరుగుతుందన్నారు .ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిమ్జ్ ఏర్పాటుతో మారుమూల ప్రాంతాలైన జహీరాబాద్ నియోజకవర్గాల రూపురేఖలు మారిపోతాయి అన్నారు. నిమ్జ్ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నిమ్జ్ ఏర్పాటుకు భూములు ఇచ్చిన వారికి నష్టపరిహారం అందించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విషయంపై ఆయా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించి భూ సేకరణ ప్రక్రియ వేగవంతం అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు ఆయా మండలాలలో గ్రామాల వారీగా చేసిన భూసేకరణ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎంత సేకరణ చేయాల్సి ఉంది అన్న వివరాలను కలెక్టర్ ఆయా మండలాల రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాలలో ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పనులు వేగవంతంగా చేసి నిమ్జ్ ప్రాజెక్టు సకాలంలో ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ( రెవిన్యూ) మాధురి, నిమ్జ్ ప్రత్యేక అధికారి రాజు, జహీరాబాద్ ఆర్డిఓలు, తహసిల్దార్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

అంబర్ పేట, మే, 27(సమయం న్యూస్) : అంబర్ పేట డివిజన్ పరిధిలో ఆర్యవైశ్య సంఘం ప్రేమ్ నగర్ ఆధ్వర్యంలో ప్రతి అమావాస్యకు వివిధ ప్రాంతాల్లో అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా సోమవారం ప్రేమ్ నగర్ గ్రీన్ ల్యాండ్ హోటల్ వద్ద అమావాస్య అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జిల్లా రవీందర్, ప్రధాన కార్యదర్శి కూన అంజయ్య , కోశాధికారి ఆకుల రమేష్, అడ్మినిస్ట్రేషన్ ఉపాధ్యక్షులు తిరుపతి గుప్తా, చైర్మన్ జిల్లా హరిబాబు, శరణయ్య, నేతి శ్రీనివాస్, గట్టు ప్రకాష్, వెంకటేష్, అంబటిపల్లి మల్లేశం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# శిక్షణలో సర్వే అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి

*** హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

హనుమకొండ మే 27(సమయం న్యూస్) : లైసెన్స్ సర్వేయర్ శిక్షణా కార్యక్రమంలో సర్వేకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని సాంకేతిక శిక్షణాభివృద్ధి కేంద్రం (టిటిడిసి)లో జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ కార్యక్రమంలో సర్వే నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై నిర్వహిస్తున్న బోధనా తరగతులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బోధనా అంశాలను కలెక్టర్ విన్నారు. శిక్షణార్థులతో కలెక్టర్ సంభాషించారు. శిక్షణ కార్యక్రమం గురించి శిక్షణార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శిక్షణకు సంబంధించిన మెటీరియల్ను






కలెక్టర్ చేతుల మీదుగా అభ్యర్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ లైసెన్స్ సర్వేయర్లకు 50 రోజులపాటు నిర్వహించే శిక్షణ కాలంలో సర్వేకు సంబంధించిన అన్ని అంశాలపై పట్టు సాధించే విధంగా శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. సర్వేకు సంబంధించిన అంశాలపై శిక్షణార్థులకు 50 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం అనంతరం అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎలాంటి భూవివాదాలు పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది అన్నారు. భూ వివాదాలు లేకుండా ఉండాలంటే ఫీల్డ్ సర్వే చేయడం ద్వారా సాధ్యమవుతుందన్నారు. శిక్షణ అనంతరం పరీక్షను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి భూభారతి సర్వే చేసేందుకు అవకాశం లభిస్తుందన్నారు. భూ వివాదాల పరిష్కారానికి సర్వే రిపోర్ట్ ఎంతో ప్రాముఖ్యత ఉంటుందన్నారు. శిక్షణార్థుల హాజరు అన్ని రోజులపాటు అటెండెన్స్ పక్కాగా తీసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం క్షేత్రస్థాయిలో బాగా పనిచేయాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే వాటిని గురించి నివృత్తి చేసుకోవాలన్నారు. సర్వే సంబంధించిన అన్ని విషయాలను తెలుసుకునే విధంగా తరగతులను మిస్ చేసుకోవద్దని అన్నారు. శిక్షణ తరగతులను సరిగ్గా వింటేనే ప్రాక్టికల్ గా చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## మంచినీటి సమస్యను పరిష్కరించిన కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్

అంబర్ పేట ,మే ,27 (సమయం న్యూస్) : అంబర్ పెట్ డివిజన్ ప్రేమ్ నగర్ లో స్థానికుల ఫిర్యాదు మేరకు మంచినీటి సమస్యని పరిశీలించిన అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్థానిక బస్తీ ప్రజలతో కలిసి ప్రేమనగర్ లో స్థానికంగా మంచినీటి సమస్య ఉండడంతో పరిస్థితిని సమీక్షించి సంబంధిత సిబ్బందిని పిలిపించి, సమస్య ఉత్పన్నమైన ప్రాంతాన్ని గుర్తించి వెంటనే మరమ్మతులు చేపించి సమస్యను పరిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్, పలు పార్టీల నాయకులు జగత్ సింగ్,మనోజ్,సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి ఆసరాగా సీఎం సహాయ నిధి

సమయం న్యూస్, తంగళ్లపల్లి, మే 27: నిరుపేద కుటుంబానికి ఆసరాగా నిలిచింది సీఎం సహాయ నిధి. తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన పొన్నం రవి స్థానికంగా హోటల్ నిర్వహిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం ఆరోగ్య సమస్యలతో హాస్పిటల్లో చికిత్స చేసుకోవడం జరిగింది. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు చికిత్స ఖర్చులు తలకు మించిన భారమే అయ్యాయి. చికిత్స కోసం అప్పు చేయడం జరిగింది. వాటిని ఎలా తీర్చాలి అనే సందిగ్ధంలో ఉన్నవారికి సీఎం సహాయ నిధి గురించి తెలిసి ఆసుపత్రి యాజమాన్యంతో చికిత్సకు సంబంధించిన వివరాల ప్రజలను స్థానిక కాంగ్రెస్ నాయకుల సహకారంతో సీఎం సహాయ నిధికి అప్లై చేసుకోవడం జరిగింది. నేడు సీఎం సహాయ నిధి నుంచి వారికి చెక్ రావడంతో వారు సంతోషన్ని వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు బాలసాని నర్సయ్య, కృష్ణారెడ్డి, ఆసరి బాలరాజు, బాలసాని తిరుపతి, సర్దార్, ఉడుతల నరేందర్, తుపాకుల శోభ పాల్గొన్నారు.



## పట్టణ ప్రాంతంలో ప్రజారోగ్య రక్షణకు చర్యలు

*** మెదక్ ఎమ్మెల్యే మైనం పల్లీ రోహిత్ రావు.**

మెదక్ మే 27(సమయం న్యూస్) : మెదక్, రామయంపేట్ మున్సిపాలిటీల అభివృద్ధి, ప్రజారోగ్య రక్షణ శానిటేషన్ లో భాగంగా పటిష్ట కార్యచరణ ప్రణాళిక ద్వారా చర్యలు చేపడుతున్నట్లు మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ మెదక్ ,రామయంపేట్ మున్సిపాలిటీల పటిష్ట పర్యవేక్షణకు మెదక్ ఆర్డీవో రమాదేవి కు ప్రత్యేక బాధ్యతలు అప్పగించడం జరిగిందని తెలిపారు. మెదక్ నియోజకవర్గంలో వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని శానిటేషన్ పై స్పెషల్ డ్రైవ్ చేపట్టామని చెప్పారు. ప్రజలకు కీటక జనిత వ్యాధులు, మలేరియా, డెంగ్యూ విష జ్వరాలు ప్రజలకు సోకకుండా ఉండేందుకు మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలు శానిటేషన్ లో భాగంగా పటిష్ట కార్యాచరణ ప్రణాళికలు ద్వారా ముందుకు పోతున్నామన్నారు.



## గోల్నాక డివిజన్లో పర్యటించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్ పేట, మే,27(సమయం న్యూస్) : అంబర్ పేట నియోజకవర్గం గోల్నాక డివిజన్ పరిధిలో శ్యాంనగర్, సుందర్ నగర్ లో పర్యటించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ . ప్రజల అవసరాలకు తీర్చే విధంగా తగిన సిసి రోడ్లు, స్ట్రీట్ లైట్లు, మంచినీటి పైప్ లైన్ త్వరలో ఏర్పాటు చేస్తామని బస్తీ వాసులు ఎమ్మెల్యే గారు హామీ ఇవ్వడం జరిగింది.



## అండూరు మల్లన్న జాతరలో బిఆర్ఎస్ నాయకులు

జిన్నారం, మే 27, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని అండూరు గ్రామంలో జరుగుతున్న మల్లికార్జున స్వామి జాతర మహోత్సవంలో సోమవారం నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బిఆ ర్ఎస్ నాయకులు మెట్టు కుమార్ యాదవ్, మాణిక్ యాదవ్ లు స్వామివారి ని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. వారు మాట్లాడుతూ ప్రజల ఐక్యత సాంప్రదాయాలు ఇలాంటి ఉత్సవాలకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. నాయకులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. జాతర సందర్భంగా గ్రామము మొత్తం పండుగ వాతావరణాన్ని సంకరించుకుంది. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, శివ శంకర్, మహేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.


# గిగ్, ప్లాట్ ఫాం కార్మికులు ఈ శ్రమ్ పోర్టల్ లో పేర్లు నమోదు చేసుకోవాలి

*** సహాయ కార్మిక అధికారి ఎంకే హేమలత**

పెద్దపల్లి, మే 27(సమయం న్యూస్) 202425 సంవత్సరంలో ప్రభుత్వం ఎడిట్ స్కూల్స్ గిగ్ , ప్లాట్ ఫాం కార్మికులు ఈ శ్రమ్ పోర్టల్ లో పేర్లు నమోదు చేసుకోవాలని సహాయ కార్మిక అధికారి ఎంకే హేమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సంఘటిత అసంఘటిత రంగాల్లో పనిచేసే గిగ్, ప్లాట్ ఫాం కార్మికులను కలుపుకొని సామాజిక భద్రత విస్తరిస్తున్నట్లు తెలిపారు. 202526 సంవత్సరాలకు సంబంధించి ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి యోజన, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజనను ఇట్టి కార్మికులకు విస్తరిస్తున్నామని, ఈ శ్రమ పోర్టల్ లో కార్మికుల నమోదు చేసుకుంటే వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. భారత ప్రభుత్వ కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మే 31 వరకు ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని కొరియర్ హోమ్ సర్వీసెస్ ,ఫుడ్ డెలివరీ ,ఏసీ టెక్నీషియన్, గ్రాఫిక్ డిజైనర్స్ తో పాటు అమెజాన్, ఫ్లిప్ కార్ట్ ,జొమాటో సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులందరూ వినియోగించుకోవాలని, తప్పనిసరిగా ఈ శ్రమ్ పోర్టల్ లో పేర్లు నమోదు చేసుకోవాలని సహాయ కార్మిక అధికారి ఎంకే హేమలత ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఒక విద్యార్థి జీవితాన్ని నాశనం చేస్తారా..? బాంబే హైకోర్టు ఆగ్రహం

ఒక విద్యార్థిని అరెస్టు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వంపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆమె జీవితం నాశనం చేస్తారా..? అని ప్రశ్నించింది. ఇంతకీ ఏం జరిగిందంటే..? మహారాష్ట్రలో పుణెలోని ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతోన్న 19 ఏళ్ల విద్యార్థిని.. ఆపరేషన్ సిందూర్‌పై పోస్టు పెట్టింది. అది విమర్శనాత్మకంగా ఉండటంతో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. తర్వాత ఆమెను పుణెలోని ఎరవాడ జైల్లో ఉంచారు. దీనిపై ఆ విద్యార్థిని హైకోర్టును ఆశ్రయించారు. సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయని ఈ పిటిషన్‌ను వెంటనే విచారించాలని ఆమె తరపు న్యాయవాది అభ్యర్థించారు. దీనిని పరిగణనలోకి తీసుకునేందుకు హైకోర్టు ధర్మాసనం అంగీకరించింది. ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆమెను విడుదల చేయాలని ఆదేశించింది. తమ అభిప్రాయాన్ని



వ్యక్తంచేసినంత మాత్రాన అరెస్టు చేయలేరని అసహనం వ్యక్తంచేసింది. “ఇదేం ప్రవర్తన..? ఒక విద్యార్థి జీవితాన్ని నాశనం చేస్తున్నారా..? ఆమెను వివరణ కోరారా..?” అని ప్రశ్నలు వేసింది. ఇక ఆమె పోలీసుల భద్రతతో పరీక్షలకు హాజరుకావొచ్చని కళాశాల తరపు న్యాయవాది వినిపించిన వాదనను తోసిపుచ్చింది. ఆమె నేరస్థురాలు కాదని పేర్కొంది.

## భారత సరిహద్దులో ఓ పోస్టుకు ‘సిందూర్’ పేరు!

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ ‘ఆపరేషన్ సిందూర్ ’తో చావు దెబ్బకొట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత సైన్యం చూపిన తెగువకు గుర్తుగా సాంబా సెక్టార్‌లోని ఓ పోస్టుకు ‘సిందూర్’ అని పేరు పెట్టాలని భారత సరిహద్దు భద్రతా దళం (BSF) ప్రతిపాదించింది. మే 10న సరిహద్దు ప్రాంతాల్లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో అమరులైన మరో ఇద్దరి పేర్లను కూడా పరిశీలించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. మే 10న సరిహద్దు పాక్ జరిపిన కాల్పుల్లో ఇద్దరు బీఎస్‌ఎఫ్ జవాన్లు, మరో భారత సైనికుడు మరణించారని బీఎస్‌ఎఫ్ ఐజీ జమ్మూ ఫ్రాంటియర్ శశాంక్ ఆనంద్ అన్నారు. ‘‘మే 10న పాకిస్థాన్ మా పోస్టులను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులకు పాల్పడింది. బీఎస్‌ఎఫ్ దళాలు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటున్నసమయంలో బృందంలోని బీఎస్‌ఎఫ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఇంతియాజ్, కానిస్టేబుల్ దీపక్ కుమార్ ప్రాణాలు కోల్పోయారు. కాబట్టి సరిహద్దులోని




పోస్టుకు వారి పేర్లను కూడా పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాము’’ అని శశాంక్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బీఎస్‌ఎఫ్ మహిళా సిబ్బంది ఎంతో తెగువతో ఫార్వర్డ్ పోస్టులపై పాక్‌తో పోరాడారని శశాంక్ ప్రశంసించారు. అసిస్టెంట్ కమాండెంట్ నేహా భండారి నేతృత్వంలో మహిళా బీఎస్‌ఎఫ్ కానిస్టేబుళ్లు పాక్ డ్రోన్‌లను సమర్థవంతంగా తిప్పి కొట్టారని తెలిపారు. మరోవైపు భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తతలు చల్లారడంతో ఉగ్రవాదులు భారత్‌లో చొరబాటుకు ప్రయత్నిస్తున్నారని.. పాక్ ఆక్రమిత కశ్మీర్ వెంబడి వారు చొరబడే అవకాశం ఉందని నిఘా వర్గాలు పేర్కొన్నాయన్నారు. కాబట్టి భద్రతా దళాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## పాక్ సైన్యం గుండెల్లో ‘విధ్వంసక్’..
# ఆపరేషన్ సిందూర్‌లో కీలకం..!

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ దాడులను దీటుగా తిప్పికొట్టిన సరిహద్దు భద్రతా దళం.. శత్రు సైన్యానికి చుక్కలు చూపించిన సంగతి తెలిసిందే. ఓవైపు మన గ్రామాలపైకి దూసుకొచ్చిన డ్రోన్లు, క్షిపణులను నిర్వీర్యం చేస్తూనే.. వారి స్థావరాలను, టవర్లు, బంకర్లే లక్ష్యంగా దాడులు చేసింది. ఇలా ఆపరేషన్ సమయంలో పాకిస్థాన్‌కు చెందిన 72 పోస్టులు, 47 వ్యూహాత్మక ప్రాంతాలను (ఫార్వర్డ్ పోస్టులు) ధ్వంసం చేసినట్లు బీఎస్‌ఎఫ్ వెల్లడించింది. పాకిస్థాన్‌ను విశ్వసించలేమని, ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని సరిహద్దు భద్రతా దళం స్పష్టం చేసింది. చొరబాటుదారుల ముప్పు అధికంగా ఉన్న నేపథ్యంలో అంతర్జాతీయ సరిహద్దుల్లో అత్యంత అప్రమత్తంగా ఉన్నామని తెలిపింది. జమ్మూ బీఎస్‌ఎఫ్ హెడ్‌క్వార్టర్‌లో ఏర్పాటు చేసిన ఆయుధాల ప్రదర్శన సందర్భంగా.. ఆపరేషన్



సిందూర్‌లో ఉపయోగించిన ‘విధ్వంసక్’తో పాటు ఇతర ఆయుధాల గురించి బీఎస్‌ఎఫ్ అధికారులు వివరించారు.

**ఏమిటీ విధ్వంసక్..?**

దేశీయంగా అభివృద్ధి చేసిన ‘యాంటీ మెటీరియల్ రైఫిల్’ ఇది. విధ్వంసక్ పరిధి 1300 మీటర్ల నుంచి 1800 మీటర్లు. అవసరానికి అనుగుణంగా బ్యారెల్స్, బోల్టులు, మ్యాగజైన్లను మార్చుకోవచ్చు. ఒక్కో మ్యాగజైన్‌లో మూడు రౌండ్లు ఉంటాయి. శత్రువుల రహస్య ప్రదేశాలు, బంకర్లు, ట్యాంకర్లు, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను నాశనం చేయగలదు. దేశీయంగా తయారు చేసిన ఈ ఆయుధం.. ఆపరేషన్ సిందూర్ సమయంలో అన్ని లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు బీఎస్‌ఎఫ్ అధికారులు వెల్లడించారు. ‘‘ఇది ఆటోమేటిక్ గ్రెనేడ్ సిస్టమ్‌తో పనిచేసే మీడియం మెషిన్‌గన్. ఈ 12.7 ఎంఎం యాంటీక్రాఫ్ట్ కలిగి ఉండే దీనిని ఆపరేట్ చేసేందుకు ముగ్గురు సిబ్బంది అవసరం. నిమిషానికి 650-1000 రౌండ్ల వరకు కాల్పులు జరుపుతుంది. ప్రవహించే నీటిని కూడా ఆపగలదు. పేలుడు ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. దీన్నుంచి వెళ్లే గ్రెనేడ్ పడినచోట 10 మీటర్ల పరిధిలో ఉన్న వ్యక్తులను చంపగలదు. ఇటీవల ఆపరేషన్‌లో పాక్ దాడులను ఎదుర్కొనేందుకు దీన్ని ఉపయోగించాం. దీంతోనే పాక్ అబ్జర్వేషన్ ఔట్‌పోస్టును ధ్వంసం చేశాం. ఈ ఆయుధంతో శత్రుమూకలు సరిహద్దు నుంచి తోకముడిచాయి’’ అని బీఎస్‌ఎఫ్ అధికారులు పేర్కొన్నారు.



## సుక్మా జిల్లాలో 18 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో పోలీసుల ఎదుట 18 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) బెటాలియన్‌లో చురుకుగా ఉన్న నలుగురితో సహా 18 మంది లొంగిపోయారు. వారిలో 10 మందిపై గతంలో మొత్తం రూ.38 లక్షల రివార్డు ప్రకటించారు. సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ముందు వీరు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న నక్సల్ రహిత గ్రామ పంచాయతీ పథకం కింద సాధించిన విజయంగా దీన్ని ఎస్పీ పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో పెద్దఎత్తున మావోయిస్టులను భద్రతాదళాలు మట్టుబెట్టాయి. ఈ నేపథ్యంలో వీరు లొంగిపోయినట్లు తెలుస్తోంది.


## పహల్గాంలో క్యాబినెట్ భేటీ..
# పోస్టు పెట్టిన సీఎం ఒమర్ అబ్దుల్లా

జమ్మూకశ్మీర్‌లో పహల్గాం ఉగ్రదాడితో దేశం మొత్తం దిగ్భ్రాంతికి గురైన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ఘటనాస్థలంలో ప్రత్యేక క్యాబినెట్ సమావేశం జరిగింది. పిరికిపంద చర్యలకు తాము ఏమాత్రం భయపడబోమనే సందేశాన్నిపంపుతూ జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఈ సమావేశాన్ని నిర్వహించింది. ఈ ప్రభుత్వ హాయంలో వేసవి రాజధాని శ్రీనగర్, శీతాకాల రాజధాని జమ్ము వెలుపల ఇలా మంత్రులు భేటీ కావడం ఇదే తొలిసారి అని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. ప్రకృతి అందాలకు నెలవైన పహల్గాంలోని బైసరన్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు బలయ్యారు. దాంతో అప్పటినుంచి పర్యాటకుల రాక తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో పర్యాటకంపైనే ఆధారపడిన, ఉగ్రదాడితో భీతావహులైన స్థానిక ప్రజలకు సంఘీభావంగా ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు సీఎం మీడియాకు వెల్లడించారు. ‘‘మేం ప్రజల ధైర్యానికి సెల్యూట్ చేస్తున్నాం. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు పహల్గాంకు వచ్చాం. ఆ దిశగా చర్యలు కొనసాగుతాయి’’ అని



అన్నారు. పహల్గాం క్లబ్‌లో జరిగిన మీటింగ్ దృశ్యాలను ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ‘‘ఉగ్రవాదుల పిరికిపంద చర్యలకు ఏ మాత్రం భయపడేదిలేదనే స్పష్టమైన సందేశాన్ని ఇచ్చేందుకే ఇక్కడకు వచ్చాం. జమ్మూకశ్మీర్ దృఢంగా నిలుస్తుంది’’ అని ఆ పోస్టులో రాసుకొచ్చారు. 2009 నుంచి 2014 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఆయన ఉత్తర కశ్మీర్‌లోని గురెజ్, మచిల్, తాంగ్‌ధర్, జమ్మూప్రాంతంలోని రాజౌరీ, పూంఛ్‌లోనూ ఇలా క్యాబినెట్ సమావేశాలు నిర్వహించారు. ప్రధాని మోదీ అధ్యక్షత వహించే నీతిఆయోగ్ సమావేశాన్ని ఇక్కడ నిర్వహించాలని అభ్యర్థించారు. ఈ తరహా చర్యలు స్థానిక ప్రజల్లో భయాలను తొలగిస్తాయని ఆయన విశ్వసిస్తున్నారు.

# జ్యోతి మల్హోత్రా గ్యాడ్జెట్లలో 12టెరా బైట్ల డేటా..!



పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తోందన్న ఆరోపణలపై అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు సంబంధించి మరో విషయం వెలుగులోకి వచ్చింది. తనతో టచ్‌లో పాక్ అధికారులు ఇంటర్‌సర్వీస్ ఇంటెలిజెన్స్ తో కలిసి పనిచేస్తున్నారని జ్యోతికి తెలుసని దర్యాప్తుతో సంబంధం ఉన్న వర్గాలు వెల్లడించాయి. కానీ ఆమె భయపడకుండా ఆ సంప్రదింపులు కొనసాగించారని పేర్కొన్నాయి. ఆమె ల్యాప్‌టాప్, ఫోన్‌లోని సమాచారం ఆధారంగా ఈ విషయాన్ని వెల్లడించాయి. .గూఢచర్యం ఆరోపణలపై అరెస్టయిన జ్యోతి ల్యాప్‌టాప్, ఫోన్‌ను స్వాధీనం చేసుకొని ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. వాటిల్లో అప్పటికే తొలగించిన సమాచారాన్ని అధికారులు రికవరీ చేశారని, అదంతా 12టెరాబైట్ల మేర ఉందని సమాచారం. ఈ కేసులో మరిన్ని ఆధారాల కోసం ఆ డేటాను స్కాన్ చేస్తున్నారు. తాను ఐఎస్‌ఐకు సంబంధించిన వ్యక్తులతో మాట్లాడుతున్నానని తెలిసే, కాంటాక్ట్ కొనసాగించారని ఆ సమాచారం ఆధారంగా ప్రాథమికంగా గుర్తించారు. జ్యోతి నలుగురు పాక్ ఐఎస్‌ఐ ఏజెంట్లతో నేరుగా మాట్లాడిందని, వారిలో డానిష్, అహ్సన్, షాహిద్ ఉన్నారని ఆ వర్గాలు వెల్లడించాయి. ఐఎస్ఐలో ఆ ఏజెంట్ల హోదాలు, ఉద్యోగాలు ఏంటో ధ్రువీకరించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక..జ్యోతి మల్హోత్రాకు పాక్‌లో ఆరుగురు వ్యక్తులు ఏకే 47లతో భద్రత కల్పించిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. వారు ధరించిన జాకెట్లపై ‘‘నో ఫియర్’’ అని రాసి ఉన్నట్లు కనిపించింది. ఇక, 2023లో వీసా కోసం పాక్ హైకమిషన్‌కు వెళ్లిన సమయంలో తొలిసారి డానిష్ పరిచయం అయ్యాడని వెల్లడించింది. పాక్ హైకమిషన్ కార్యాలయానికి వీసా కోసం వచ్చే వారిని ట్రాప్ చేసి వారిని డానిష్ గూఢచర్యానికి వాడుకొనేవాడని.. యూట్యూబర్ జ్యోతి కూడా వీసా కోసం వెళ్లగా ఆమెను ట్రాప్ చేశాడని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఇంతకాలం పోలీస్ రిమాండ్‌లో ఉన్న జ్యోతిని కోర్టు నిన్న 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పంపింది. పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్క్ పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. కొన్ని వారాల వ్యవధిలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా సహా 10 మందికిపైగా అరెస్టయిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్.. గుల్వీర్ సింగ్‌కు స్వర్ణం

గమి (దక్షిణ కొరియా): భారత స్టార్ రన్నర్ గుల్వీర్ సింగ్ ఆసియా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించాడు. పురుషుల 10 వేల మీటర్ల రేసును 28 నిమిషాల 38.63 సెకన్లలో ముగించి ఈ మెడల్ అందుకున్నాడు. ఈ క్రమంలోనే గుల్వీర్ జాతీయ రికార్డు కూడా నెలకొల్పాడు. ఇక, మెబుకి సుజుకీ (జపాన్) 10 వేల మీటర్ల రేసును 28 నిమిషాల 43.84 సెకన్లతో ముగించి రజత పతకం సాధించాడు. అల్బర్ట్ కిబిచి రోప్ (బహ్రెయిన్) 28 నిమిషాల 46.82 సెకన్లతో కాంస్య పతకం గెలుచుకున్నాడు. గుల్వీర్ సింగ్ మరో పతకం సాధించే అవకాశం కూడా ఉంటుంది. మే 30న జరిగే పురుషుల 5000




మీటర్ల ఫైనల్‌లో అతను పాల్గొననున్నాడు. 5 వేల మీటర్ల రేసులో గుల్వీర్‌కు మంచి రికార్డు ఉంది.

**20 కి.మీ.నడకలో కాంస్యం..**

పురుషుల 20 కి.మీ నడకలో సెర్విన్ సెబాస్టియన్ (1 గంట 21 నిమిషాల 13.60 సెకన్లు) కాంస్యం సాధించాడు. చైనాకు చెందిన వాంగ్ జావోజావో (1 గంట 20 నిమిషాల 36.90 సెకన్లు) స్వర్ణ పతకం అందుకోగా.. జపాన్‌కు చెందిన కెంటో యోషికావా (1 గంట 20 నిమిషాల 44.90 సెకన్లు) రజతం దక్కించుకున్నాడు. మహిళల జావెలిన్‌త్రోలో అన్నురాణి త్రుటిలో కాంస్యం పతకం చేజార్చుకుంది. అన్నురాణి బెస్ట్ త్రో 58.30 మీటర్లు కాగా.. 64 సెంటీమీటర్ల తేడాతో నాలుగో స్థానంలో నిలిచి మెడల్‌ను మిస్ చేసుకుంది. జపాన్‌కు చెందిన సే టకేమోటో (58.94 మీటర్లు) కాంస్య పతకం సాధించింది. సు లింగ్డాన్ (చైనా.. 63.29 మీటర్లు) స్వర్ణం, మోమోన్ ఉడా (జపాన్.. 59.39 మీటర్లు) రజత పతకాలు అందుకున్నారు.

# మరో రెండు రికార్డులకు అడుగు దూరంలో విరాట్ కోహ్లీ

ఛేజింగ్ మాస్టర్ విరాట్ కోహ్లీని ఐపీఎల్‌లో మరో రెండు రికార్డులు ఊరిస్తున్నాయి. ప్రస్తుతం వాటికి కోహ్లీ కేవలం అడుగు దూరంలోనే ఉన్నాడు. ఈ సీజన్‌లోనే వాటిని సాధించే అద్భుత అవకాశం అతడి ముందు ఉంది. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఆర్సీబీ తరఫున 12 ఇన్నింగ్స్‌ల్లో 548 రన్స్‌తో విరాట్ కోహ్లీ అత్యధిక పరుగుల వీరుడిగా కొనసాగుతున్నాడు. మరో 24 పరుగులు చేస్తే టీ20ల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున 9,000 పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలుస్తాడు. ఐపీఎల్‌లో 256 ఇన్నింగ్స్‌లో 8,552 పరుగులు చేసిన కోహ్లీ, సీఎల్‌టీ20 (ఛాంపియన్ లీగ్ టీ20)లో 14 ఇన్నింగ్స్‌లో 424 రన్స్ సాధించాడు. మొత్తంగా ఆర్సీబీ తరఫున 270 ఇన్నింగ్స్‌ల్లో 8,976 పరుగులు చేశాడు. ఈ మైలురాయిని బుధవారం లఖ్‌నవూ సూపర్ కింగ్స్‌తో, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు జరిగే మ్యాచ్‌లోనే సాధించే అవకాశం ఉంది. అలాగే విరాట్ కోహ్లీ మరో అర్ధశతకం బాదితే, ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక అర్ధశతకాలు బాదిన బ్యాటర్‌గా నిలిచే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు 62 అర్ధశతకాలతో డేవిడ్ వార్నర్‌తో సమానంగా ఉన్నాడు. విరాట్ ఈ సీజన్‌లో ఇప్పటికే ఏడు హాఫ్‌సెంచరీలు సాధించాడు. ఇంతకు ముందు 2016 సీజన్‌లో 11, 2023 సీజన్‌లో 8 అర్ధశతకాలు బాదాడు.

## సినిమా



# శ్రీవారిని దర్శించుకున్న దిల్ రాజు

**తిరుమల:** ఇవాళ శృతిహాసన్ శ్రీవారిని ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజు దంపతులు దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు దిల్ రాజు దంపతులకు స్వాగతం పలికి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అధికారులు వారికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



# కన్నప్ప హార్డ్ డిస్క్ మాయం

**24 ఫ్రేమ్స్ సిబ్బందిపై కేసు**

టాలీవుడ్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమా నుంచి బయటకు వస్తున్న ఒక్కో అప్ డేట్, ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈమూవీని ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్ట్ చేయగా, ఎం.మోహన్ బాబు భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇక ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే, ఈ సమయంలో ఈ మూవీ టీమ్‌కు ఊహించని షాక్ తగిలింది. 'కన్నప్ప' చిత్రానికి సంబంధించి పలు కీలక సన్నివేశాలు ఉన్న హార్డ్ డిస్క్ మాయం అయినట్లు చిత్రబృందం తాజాగా వెల్లడించింది. ఈ హార్డ్ డిస్క్ మిస్ కావడంతో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ విజయ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిర్మాణ సంస్థ 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ ఉద్యోగుల పైన కేసు నమోదు చేశారు. ఇక ఈ సినిమాలో మోహన్ బాబు, అక్షయ్ కుమార్, ప్రభాస్, మోహన్ లాల్, కాజల్ అగర్వాల్ వంటి స్టార్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా జూన్ 27న భారీ స్థాయిలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

# లంగాఓణిలో ఆషికా

'అమిగోస్' మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ ఆషికా రంగనాథ్. తన ఫస్ట్ సినిమాతోనే యూత్‌లో మంచి ఫేమ్‌దక్కించుకుంది. తన అందం, అభినయంతో ఆకట్టుకుంటూ కుర్రకారు మనసును కొల్లగొట్టింది. దీంతో ఈ అమ్మడికి వరుసగా ఆఫర్లు క్యూ కట్టాయి. కింగ్ నాగార్జున జంటగా 'నా సామి రంగా' చిత్రంతో పాటు కోలీవుడ్ స్టార్ సిద్ధార్థ్ మూవీ 'మిస్ యూ'తో మెస్మరైజ్‌చేసింది. ప్రస్తుతం ఈ కన్నడ భామ మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంలో నటిస్తోంది. దీని తర్వాత ఆషికకు ఇంకా చాన్స్‌లు వస్తాయని అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు మూవీల సంగతి ఎలా ఉన్నా ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో తన గ్లామర్ డోస్‌తో యూత్ ను రెచ్చగొడుతుంది. లేటెస్టుగా ఆషికా తన ఇన్‌స్టాలో కొన్ని పిక్స్ షేర్ చేసింది. గోల్డ్, ఆరెంజ్ కలర్ లంగా ఓణిలో క్యూట్ స్టిల్స్ ఇచ్చింది. మెడలో చోకర్, పాపిట బిళ్ల, గాజులు, రింగ్స్ పెట్టుకుని ట్రెడిషనల్‌లుక్ లోమెరిసిపోతోంది. ఈ ఫొటోలకు 'జీవితం నీకు టాంజెరిన్లు ఇచ్చినప్పుడు' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పిక్స్‌నెట్టింట తెగ వైరలవుతున్నాయి.






# 'టూరిస్ట్ ఫ్యామిలీ' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్...

ప్రముఖ దర్శకుడు రాజమౌళి మెచ్చిన కామెడీ డ్రామా మూవీ 'టూరిస్ట్ ఫ్యామిలీ' ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. 'జియో హాట్‌స్టార్' లో జూన్ 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది. శశికుమార్, సిమ్రన్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అభిషాన్ జీవింత్ తెరకెక్కించిన ఈ సినిమా మే 1న థియేటర్లలో విడుదలైంది. "అద్భుతమైన సినిమా చూశా. హృదయాన్ని కదిలించింది. కడుపుబ్బా నవ్వించింది. అభిషాన్ గొప్పగా రచించి, డైరెక్షన్ చేశారు. ఇటీవల కాలంలో చూసి బెస్ట్ సినిమా ఇది. మీరూ తప్పకుండా చూడండి" అని ఈ సినిమాని ఉద్దేశించి కొన్ని రోజుల క్రితం పోస్టు పెట్టిన సంగతి తెలిసిందే. కోలీవుడ్ హీరోలు రజనీకాంత్, సూర్య, శివకార్తికేయన్ టాలీవుడ్ హీరో నాని తదితరులు ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు. రూ.10 కోట్ల లోపు బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా దాదాపు రూ.75 కోట్లు వసూలు చేయడం విశేషం.

# 70ఏళ్ల కమల్‌తో 42ఏళ్ల త్రిష రొమాన్స్.. ట్రోలర్స్‌కు మణిరత్నం పర్‌ఫెక్ట్ ఆన్సర్

కమల్‌హాసన్ కీలక పాత్రలో మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'థగ్‌లైఫ్'. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 5న తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచింది. అయితే, ట్రైలర్‌లో త్రిష, అభిరామిలతో కమల్‌హాసన్ రొమాన్స్ చేసే సన్నివేశాలపై సామాజిక మాధ్యమాల వేదికగా ట్రోల్స్ మొదలయ్యాయి. 70 ఏళ్ల కమల్, 42ఏళ్ల త్రిషతో రొమాన్స్ ఏంటి? అంటూ పోస్టులు పెట్టడం మొదలు పెట్టారు. తనకంటే వయసులో 28ఏళ్ల చిన్నదైన అభిరామితో లిప్‌లాక్ పైనా కొందరు ట్రోల్స్ చేశారు. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఆ విమర్శలకు దర్శకుడు మణిరత్నం కాస్త ఘాటుగానే సమాధానం ఇచ్చారు. "నిజ జీవితంలోనూ అలాంటి వ్యక్తులు ఉంటారు. పురుషులు, మహిళలు ఎవరైనా తమకంటే చిన్నవారితో లేదా పెద్దవారితో రిలేషన్‌షిప్‌లో ఉంటారు. అది జీవిత సత్యం. ఇలాంటి బంధాలు ఇప్పుడు పుట్టినవి కావు. ఎంతో కాలం నుంచి ఉన్నాయి. సినిమాల విషయానికొస్తే, ఏదైనా విషయంపై తప్పు ఎత్తి చూపటం లేదా అభిప్రాయాన్ని తెలియజేస్తాం. అదే సమయంలో మీరు దాన్ని సమర్థించవచ్చు. లేకపోతే, సమాజంలో కళ్ల ముందు జరిగే వాటికి ఎలాగైతే మౌనంగా ఉంటున్నారో అలాగే, కళ్లు మూసుకుని కూడా ఉండవచ్చు. ఒక సన్నివేశంలో ఇద్దరు వ్యక్తుల మధ్య బంధాన్ని చూస్తున్నప్పుడు వాళ్లు కమల్‌హాసన్, త్రిషలా చూడకూడదు. అవి వాళ్లు పోషించిన పాత్రలు. సినిమాలో ఉన్నది అదే. మీరు సినిమా చూసిన తర్వాత వాళ్ల బంధం ఏంటి? ఎలా ఏర్పడింది? అది వాస్తవమా? కాదా? తెలుసుకుని అప్పుడు మీరు మీ అభిప్రాయాన్ని నిర్భయంగా చెప్పవచ్చు. అంతేకానీ, కమల్‌హాసన్, త్రిషను దృష్టిలో పెట్టుకుని చెప్పొద్దు" అని మణిరత్నం అన్నారు.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.